క్లుప్తంగా

ఆకేపాటికి అభినందన



ఆకేపాటిని సన్మానిస్తున్న నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ / కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని గురువారం ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ కడప నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బంగారు నాగయ్యయాదవ్, కార్పొరేటర్ గంగరాజు, మాధవరెడ్డి, మాజీ కార్పొరేటర్ జయ చంద్రారెడ్డి, ఆర్‌జీఆర్, చంద్ర, కోలా కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నికర జలాలు కేటాయించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు, నికర జలాలు కేటాయించి పూర్తి చేసినప్పుడు ఎద్దుల ఈశ్వర్‌రెడ్డికి ఘనమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట శివ, సుబ్రమణ్యం, బసీరున్నీషా, విజయలక్ష్మీ, కెసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించపోవడం వల్ల నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

7న ఛలో తిరుపతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 7న విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన ఛలో తిరుపతి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. గురువారం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద 'ఛలో తిరుపతి' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు సీజ్

కడప అర్బన్: సైలెన్సర్‌లను మార్చి శబ్దకాలుష్యానికి కారణమవుతున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలను విధిస్తామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. గురువారం నగరంలో శబ్దకాలుష్యాన్ని కలిగిస్తున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌ను మార్చి నిషిద్ధ సైలెన్సర్‌లను బిగించి నడుపుతున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న ఏ వాహనాలను అయినా సీజ్ చేస్తామన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కడప కార్పొరేషన్: తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని 23వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి అన్నారు. గురువారం నాగరాజు పేట అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణీలకు అందజేశారు. ఐస్‌క్రీం రవి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న నాణ్యమైన పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీలను విజయవంతం చేయాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ సూచించారు. గురువారం కడప నగరంలోని స్టెప్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎక్కువ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కిరణ్ మాట్లాడుతూ పోటీల నిర్వహణ, విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్, అన్నమయ్య జిల్లా, వైఎస్ఆర్ కడప జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గడప.. ఆంధ్రప్రదేశ్

కమలాపురం : సంక్షేమ పథకాల గడప ఆంధ్రప్రదేశ్ అని, ప్రపంచంలో ఎక్కడాలేనన్ని పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని అది కేవలం జగనన్న సీఎం కావడంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం మునిసిపాలిటీ పరిధిలోని 7, 8, 9,10వ వార్డుల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి హాజరయ్యారు.

- అర్బన్ హెల్త్.. అమోఘం
- కడప వాసులకు మెరుగైన వైద్య సేవలు
- ప్రజలకు భరోసా ఇస్తున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఈ అబ్బాయి పేరు షేక్ యాజాస్. 12 ఏళ్ల ఈ బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. అబ్బాయి తల్లి పేరు మెహరున్నీసా. కడప నగరం నాగరాజుపేటలో నివసిస్తున్నారు. తన కుమారుడు అనారోగ్యానికి గురి కావడంతో దగ్గరలోని మారుతినగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఆమె అక్కడ ఉన్న డాక్టర్‌ను కలిసింది. ఆయన సూచనల మేరకు స్టాఫ్ నర్స్ గంగా మహేశ్వరి హెచ్‌బీ (రక్తం) తో పాటు ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆ నివేదిక ప్రకారం వైద్యులు మందులు ఉచితంగా అందజేశారు. దీంతో ఆ అబ్బాయి తల్లి మెహరున్నీసా సంతోషం వ్యక్తం చేసింది. ఇక్కడ అన్నీ ఉచితంగా వైద్య సేవలు లభిస్తున్నాయి. మంచి ఆసుపత్రి.. మంచి డాక్టర్లు ఉన్నారంటూ సంతోషం వ్యక్తం చేసింది. ఇలా కడప నగరంలోని ఆసుపత్రులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాయి.



కడప నగరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వివరాలు

13	మొత్తం ఆసుపత్రులు
9	అందులో కొత్త భవనాల మంజూరు
5	పూర్తయిన భవన నిర్మాణాలు
4	నిర్మాణంలో ఉన్న భవనాలు
4	అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి

కడప నగరంలో ఉన్న 13 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు

అబ్దుల్‌నబీ స్ట్రీట్, ఆలంఖాన్‌పల్లె
అక్కాయపల్లె, నాగరాజుపేట
పాత కడప, భగత్‌సింగ్ నగర్
ఫక్కీరుపల్లె, ఎన్జీఓ కాలనీ
అగాడీ స్ట్రీట్, రాధాక్రిష్ణనగర్
రవీంద్రనగర్, ఎర్రముక్కపల్లె
వికలాంగుల కాలనీ



కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిని తలపిస్తున్న లోపలి భాగం

ఆరోగ్య రక్ష

కడప రూరల్: కడప నగరంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను అందిస్తున్నాయి.

గతమంతా అస్తవ్యస్తం...

తెలుగుదేశం పార్టీ పాలనలో కడప నగరంలో కేవలం 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండేవి. అప్పుడు ఈ కేంద్రాల్లో మందుల కొరత ఉండేది. వైద్య పరీక్షలు నామమాత్రంగా ఉండేవి. ఆసుపత్రుల్లో సౌకర్యాలు మచ్చుకైనా కనిపించేవి కావు. ఇలా పట్టణ వైద్యం అనారోగ్యంతో గాడి తప్పింది.

13 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా....

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక వైద్య రంగం కొత్త పుంతలు తొక్కింది. గతంలో కడప నగరంలో 6 మాత్రమే ఉన్న ఆరోగ్య కేంద్రాల సంఖ్య ఇప్పుడు 13కు చేరింది. అందులో చాలా వరకు కొత్త భవనాల్లో ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. అందుకోసం ఒక ఆసుపత్రికి రూ 97.82 లక్షలు ఖర్చు చేశారు. కొన్ని పాత ప్రభుత్వ భవనాలకు ఒక దానికి రూ 15 లక్షలకు పైగా మరమ్మతులకు ఖర్చు చేశారు. కొత్త భవనాలు నిర్మాణం కాని ప్రాంతాల్లో, ప్రభుత్వ భవనాలు లేని చోట వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా అద్దె భవనాల్లో సేవలు కొనసాగుతున్నాయి.

172 రకాల మందులు...

ఈ ఆసుపత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, జ్వరాలు, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్య సేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఫలితంగా ఈ ఆసుపత్రులకు ప్రజల నుంచి ఆదరణ అద్భుతంగా లభిస్తోంది. ఒక ఆసుపత్రికి ఒక రోజుకు 41 నుంచి 100 మందికి పైగా ఔట్ పేషెంట్స్ వస్తున్నారు. ఉదాహరణకు కడప నగరంలోని నకాష్, మోచంపేట ఆసుపత్రులకు ఒక రోజుకు 80 మందికి పైగా ఓపీ వస్తున్నాయి. ఈ ఆసుపత్రులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఈ ఆసుపత్రుల్లో లభిస్తున్న వైద్య సేవల పట్ల కడప వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



నాకు బీపీ ఉంది. వైద్యం కోసం ఇక్కడికి వచ్చాను. ఇక్కడ ఉచితంగా వైద్యం చేయడంతో పాటు మందులు ఇస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల కంటే అత్యుత్తమంగా ఇక్కడ వైద్య సేవలు లభిస్తున్నాయి. ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.
- వెంకటేష్, మృత్యుంజయకుంట, కడప.

సద్వినియోగం చేసుకోవాలి



పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా మంచి వైద్యం లభిస్తోంది. స్థానికులు ఇక్కడ లభించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. - డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి

- రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో నీటి సరఫరా
- నగరపాలక సంస్థ ఎస్ఈ రత్నాల రాజు



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ ఎస్ఈ రత్నాల రాజు

కడప కార్పొరేషన్: కడప నగరం మాచుపల్లె రోడ్డులో ఉక్కాయపల్లె వద్ద పగిలిపోయిన 600 ఎంఎం ప్రధాన పైపులైన్‌కు ఎంఎస్ బ్యారెల్ వేసి మరమ్మతులు పూర్తి చేశామని కడప నగరపాలక సంస్థ ఎస్ఈ రత్నాల రాజు అన్నారు. గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతనెల 29వ తేదీ ఈ పైపులైన్ పగిలిపోవడం వల్ల అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, సాయిపేట ప్రాంతాలకు నీటిసరఫరా ఆగిపోయిందన్నారు. ఆ పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేశామని, 3వ తేదీ నుంచి నీటి సరఫరా పంపింగ్ చేస్తున్నామన్నారు. ఈదశలో పెద్ద దర్గా వద్ద మరొక లీకేజీ ఏర్పడిందని, దాన్ని కూడా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నామన్నారు. రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తామన్నారు. ఆలోపు స్థానికంగా ఉన్న బోర్లను వినియోగిస్తున్నామని, 12 ప్రైవేటు, 2 నగరపాలక సంస్థ ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. పైన కనబరిచిన ప్రాంతాల్లో నీటి సమస్య ఉంటే డీఈ అబిద్ హుస్సేన్-9849907465, ఏఈ దిల్షాద్-7032663046, ఇన్‌చార్జి ఏఈ నాగార్జున-8142216232 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈ మణిగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు నైపుణ్యం పెంచుకోవాలి

- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పని చేసే బోధనేతర సిబ్బంది కంప్యూటర్ నైపుణ్యత పెంపొందించుకోవాలని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. గురువారం వైవీయూలో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్‌కలాం సెంట్రల్ లైబ్రరీలో ×కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్స్¤పై నెల రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కాగిత రహిత పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కంప్యూటర్ నేర్చుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సిస్టం ఆపరేటింగ్, హార్డ్‌వేర్ గురించి తెలుసుకుని కంప్యూటర్ వినియోగం ఈ శిక్షణ ద్వారా అభ్యసించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డా. కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటి సమస్య అరికట్టడానికి చర్యలు



పెద్ద దర్గా వద్ద పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, సాయిపేట ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మేయర్ సురేష్ బాబు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన పెద్దదర్గా వద్ద ఏర్పడిన లీకేజీ మరమ్మతు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పైపులైన్ మరమ్మతులను యుద్ధ ప్రాతికపదిన పూర్తి చేయాలన్నారు. ఆలోపు పక్కనున్న 450 ఎంఎం పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయడంతోపాటు, స్థానికంగా ఉన్న బోర్లు, నీటి ట్యాంకర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ కరిముల్లాఖాన్, ఏఈ మణిగోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో టమాటాల పంపిణీ



టమోటాల కోసం క్యూలో నిలబడ్డ జనం

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న టమాటాల కోసం గురువారం కడప రైతు బజార్‌లో జనం బారులు తీరారు. తెలతెలవారకముందే వినియోగదారులంతా చేతిలో సంచి, ఆధార్‌కార్డులతో వరుసలో నిలబడ్డారు. టమాటాల కోసం వచ్చిన ప్రతి ఒక్కరి ఆధార్‌కార్డు చూసి ఒకొక్కరికి కిలో చొప్పున అందచేశారు. ప్రస్తుతం టమాటాలు బహిరింగ మార్కెట్‌లో కిలో రూ. 100 ధర పలుకుతుండగా.. ప్రభుత్వం కిలో రూ. 50 అందిస్తుండంతో చాలా మంది వినియోగదారులు వచ్చి టమాటాలను తీసుకెళ్లారు. టమాటాల కోసం జనం తాకిడి ఎక్కువ కావడంతో ఒక దశలో రైతు బజార్ సిబ్బందికి వారిని కంట్రోల్ చేయడం ఇబ్బందిగా మారింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ప్రజలకు పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సంక్షేమ పథకాలు వెల్లువలా ప్రకటించి అమలు చేయడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం ×గడప గడపకు మన ప్రభుత్వం¤ కార్యక్రమంలో భాగంగా 9వ డివిజన్ పరిధిలోని ఎన్‌జీవో కాలనీ, గంగమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అంబవరం వరలక్ష్మి మాట్లాడుతూ తమ రేషన్ కార్డులో తన కుమారుడి పేరు మాత్రమే ఉందని, తల్లిదండ్రులమైన తమ పేర్లు లేవన్నారు. ఫలితంగా రేషన్ అందడం లేదని చెప్పారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కారించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఏ విజయలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో తన కుటుంబానికి రూ.1.80లక్షల లబ్ధి చేకూరిందని తెలిపింది. బి. శివక్రిష్ణ అనే వ్యక్తి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమ కుటుంబానికి రూ.9.72లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చే శారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 9వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, కె. సూర్యనారాయణరావు, ఎం. సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు సీహెచ్ వినోద్, కె. రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆర్వీ రమణ, బండిప్రసాద్, తోటక్రిష్ణ, వేణుగోపాల్ నాయక్, అరీఫుల్లా బాషా, బండి మరియలు, రత్నకుమారి, నారాయణమ్మ పాల్గొన్నారు.

అత్యంత ప్రజాదరణ పొందిన 'జగనన్న సురక్ష'

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అత్యంత ప్రజాదరణ పొందిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూలై 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ నూటికి నూరు శాతం న్యాయం చేశామన్నారు. కడప నియోజకవర్గ పరిధిలో 101 గ్రామసభలు నిర్వహించామని, 71,657 సర్టిఫికెట్లు ప్రజలకు అందజేశామన్నారు. 97 శాతం ప్రజల అభ్యర్థనలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో 30 డివిజన్ కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు సుబాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో శుక్రవారం జరిగే జాబ్ మేళాను నియోకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. కడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాబ్ మేళాలో కియా మోటార్స్ ఇండియా, అపోలో ఫార్మసీ, అమర్ రాజా బ్యాటరీస్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, సెంచరీ ఫ్లెవ్వుడ్స్ ఏఐఎల్ డిక్సన్, ఫ్లిప్ కార్ట్, ట్రయో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ వంటి 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. నియోజకవర్గ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

10న పార్కింగ్ కోసం వేలం

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని పాలకొండల్లోగల శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయం వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ తెలిపారు. శ్రావణమాసంలో ఆగస్టు 19, 26, సెప్టెంబరు 2, 9 తేదీలలో ఆలయ సమీపంలో భక్తులు, సందర్శకులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వాహనాల రుసుము వసూలు చేసుకునే హక్కు కోసం ఈనెల 10న ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. కడప నగరం మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలోని ఈఓ కార్యాలయం వద్ద దేవదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 73963 54149 నెంబరులో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని తపాలా శాఖలో భాగమైన తపాల జీవితబీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాల బీమా (ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా పనిచేసేందుకు యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 17న కడప పోస్టల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఏజెంటుగా పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ విద్యార్హత కలిగి 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపిక చేయబడిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ. 5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ఏజెంట్లకు పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన కమిషన్ చెల్లిస్తామన్నారు. వివరాలకు 08562–243013, 9490032695 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు 'సీత' శిక్షణా కార్యక్రమం

కడప కల్చరల్ : రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు సీత కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడప నగర దేవాలయాల గ్రూప్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్స్ అడ్మినిస్ట్రేషన్ (సీత) పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాకు చెందిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యులు, చైర్మన్లు, ధర్మకర్తలు, ఉద్యోగులు, ఆయా ఆలయాల కార్యనిర్వహణ అధికారులు హాజరవుతారని తెలిపారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ బాలికల జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్ఐవో రమణరాజును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

కడప కార్పొరేషన్: కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న కుక్కలను పట్టి కొలుముల పల్లె కంపోస్టు యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ కుక్కల సంఖ్యను నియంత్రించడానికి ఆపరేషన్లు చేయనున్నామని తెలిపారు. ఎక్కడైనా కుక్కలతో సమస్య ఉంటే ప్రజలు నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఆఫీసర్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్షలలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ భవన్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం ఈ దీక్షలను జేఏసీ ఇన్‌చార్జి ఎల్. నరసింహప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం వర్క్ టు రూల్ మాత్రమే పాటిస్తారని, సాయంత్రం 5 తర్వాత ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తాము బాధ్యత వహించబోమని హెచ్చరించారు. ఇంజినీర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికులు పనిచేస్తున్నట్లుగానే తాము 24 గంటలు పనిచేస్తూ నాణ్యమైన కరెంటు ఇస్తున్నామన్నారు. యాజమాన్యాలు చేసే జిమ్మిక్కులు, స్వార్థ ప్రయోజనాల వల్ల విద్యుత్ ఉద్యోగుల భవిష్యత్తు నాశనమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ చర్యల వల్ల విద్యుత్ ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఈ రిలే దీక్షల్లో శివ భాస్కర్, చాన్‌బాషా, బర్నబాస్, శ్యామ్ పాల్గొనగా, 20 మంది ఉద్యోగులు దీక్షల్లో కూర్చొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

కమలాపురం : వరి పంట సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం టి.చదిపిరాళ్ల గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు వరి పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. వరిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా మొదటి నెల రోజుల పాటు ఎలాంటి తెగుళ్ల ఆశించ కుండా కాపాడుకోవచ్చన్నారు. వరిలో జీఏపీ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. వీఏఏలు వెంకట కృష్ణ, మమత పాల్గొన్నారు.